క్లుప్తంగా

చింతపర్రులో బియ్యం కార్డుల పంపిణీ



చింతపర్రులో బియ్యం కార్డులు అందిస్తున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి

పాలకొల్లు అర్బన్: నవరత్నాల ద్వారా పేదలందరికీ మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ అధికారం అప్పగిస్తే అదనపు సంక్షేమ ఫలాలు అందిస్తారని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామ సచివాలయంలో గురువారం కొత్తగా మంజూరైన బియ్యం కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రోడ్లను గ్రావెల్ రోడ్లుగా వేయడానికి మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలు మంజూరు చేస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 32 మందికి రేషన్‌కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉపసర్పంచ్ పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి షేక్ సులేమాన్, వీఆర్వో మండెల నరసింహరావు, వార్డు సభ్యులు చల్లా సాంబయ్య, శిర్రా రవి, మైలా మరియమ్మ, గుమ్మాపు అమ్మోజు పాల్గొన్నారు.

మణిపూర్ మారణహోమంపై నిరసన



పాలకొల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు నిరశనగా పాలకొల్లు పట్టణంలో తెలుగు క్రైస్తవ సంఘాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గురువారం పూలపల్లి మలుపు వద్ద అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభించి బస్టాండ్ మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ సిహెచ్ పెద్దిరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల ఐక్యతను కాపాడుతూ మారణకాండను సృష్టించిన దోషులను కఠినంగా శిక్షించి శాంతిభద్రతలను కాపాడాలని నినాదాలు చేశారు. ధర్మ పరిరక్షణ ముసుగులో కొన్ని మత సంస్థలు అక్కడి జాతుల మధ్య చిచ్చు పెట్టి విద్వేషాలు సృష్టిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఎస్.ఎ బినేజర్, సెక్రటరీ శామ్యూల్, ట్రెజరర్ జాన్ కుమార్, బి సురేష్ , ఎ.ప్రసాద్, జె.సాగర్, రత్నరాజు, గోపాల మురళీ తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

పోడూరు: గుమ్మలూరు శివారు చినపేటలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని గుమ్మలూరు శివారు చినపేట ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం పలువురు గ్రామస్తులు పోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి వినతిపత్రం అందజేశారు. లోఓల్టేజీ తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామనీ, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తరచూ ఫ్యూజ్ కట్ అవుతోందనీ, కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని విద్యుత్ ఏఈకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చికిలే రత్నంరాజు, గోగులమండ పెద్దిరాజు, పమ్మి నాగరాజు, వై.చిట్టిబాబు, విప్పర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

వీరవాసరం: శ్రీ మావుళ్ళమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల హుండీ ఆదాయం లెక్కింపు గురువారం రాయకుదురులోని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారని ఆలయ ఈఓ డి.వేణుగోపాల్ తెలిపారు. శ్రీ అమ్మవార్ల హుండీ ద్వారా రూ.1,22,405 ఆదాయం లభించిందన్నారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, చింతపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో సీసీ రోడ్లకు మహర్దశ



కొత్తోటలో నిర్మించిన సీసీ రోడ్డు



వడయార్‌పేట నుంచి కుక్కలవారితోటకు నిర్మించిన రోడ్డు



శేరేపాలెం పంచాయతీ నవుదూరుగురవులో నిర్మించిన సీసీ రోడ్డు

- గడపగడపకు నిధులతో వేగంగా నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారి స్పందన తెలుసుకునేందుకు చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రహదారుల సమస్యకు మోక్షం కలిగింది. ముఖ్యంగా గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించడంతో గ్రామాల్లోని సీసీ రోడ్ల నిర్మాణానికి ఆ నిధులను ఉపయోగిస్తున్నారు. నియోజకవర్గంలో చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రతి గ్రామంలోను చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఆయా సచివాలయాల పరిధిలో పార్టీ నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో రహదారులు, కమ్యూనిటీ భవనాలు, మురుగు డ్రెయిన్ల సమస్యలున్నాయని గుర్తించారు. దీంతో సచివాలయాల పరిధిలో సమస్యను పరిష్కరించడానికి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదించాలని అధికారులను ఆదేశించారు.

మొదటి విడతలో రూ11.80 కోట్లు

నరసాపురం మండలంలో 59 సచివాలయ పరిధిలో 195 పనులను గుర్తించి రూ 11.80 కోట్లు మంజూరుకు ప్రసాదరాజు కృషి చేశారు. దీంతో సచివాలయానికి రూ20 లక్షల చొప్పున కేటాయించి రహదారులు, కమ్యూనిటీ భవనాలు, మురుగు డ్రెయిన్ల పనులు చేపట్టారు. నరసాపురం పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో 34 పనులను గుర్తించి రూ.3 కోట్లు, నరసాపురం మండలంలోని 24 సచివాలయాల పరిధిలో 97 పనులకు రూ.4.80 కోట్లు, మొగల్తూరు మండలలోని 20 సచివాలయ పరిధిలో 64 పనులకు రూ.4 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం మొదటి విడతలో మంజూరు చేసిన రూ.11. 80 కోట్లు కాకుండా రెండో విడతలో ప్రతిపాదించిన రూ.2 కోట్ల నిధులను కూడా మంజూరు చేయడంతో పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే చేపట్టిన పనులు 70 శాతం పూర్తికాగా మిగిలిన పనులు మరి కొద్ది రోజుల్లో పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సచివాలయాల పరిధిలోని చిన్న చిన్న రోడ్లు అభివృద్ధి చెందడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	సచివాలయాల	సంఖ్య	పనుల సంఖ్య ఖర్చు (రూ.కోట్లల్లో)
నరసాపురం టౌన్	15	34	రూ.3.08 కోట్లు
నరసాపురం	24	97	రూ.4.80 కోట్లు
మొగల్తూరు	20	64	రూ.4.00 కోట్లు

రహదారుల అభివృద్ధికి కృషి



గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా నియోజకవర్గంలో 195 పనులు గుర్తించి పనులు చేపట్టాం. అంతే కాక ఆర్ అండ్‌బీ రహదాలకు కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేస్తున్నాం. రహదారుల విషయమే కాకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొన్ని పూర్తికాగా మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి.

ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

సమస్యలు పరిష్కారమవుతున్నాయి



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామంలోని సమస్యలు పరిష్కారమవుతున్నాయి. మొగల్తూరులోని నాలుగు సచివాలయ పరిధిలో రహదారులు, కమ్యూనిటీ భవనాలు నిర్మించుకుంటున్నాం. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గ్రామంలోని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

– పడవల మేరీ, సర్పంచ్

దూరప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేత



లక్ష్మీనారాయణకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ కదలి మంగారావు

యలమంచిలి: అడవిపాలెం గ్రామానికి చెందిన బళ్ల లక్ష్మీనారాయణ అనారోగ్యరీత్యా వైద్యం నిమిత్తం హైదరాబాద్ వెళ్లి అతని కుమారుడు రాజేష్ వద్ద ఉంటున్నాడు. దీంతో వలంటీర్ కదలి మంగారావు రైలులో హైదరాబాద్ వెళ్లి లక్ష్మీనారాయణకు గురువారం పింఛన్ అందజేశారు. శ్రమకు ఓర్చి హైదరాబాద్ వచ్చి పింఛన్ ఇచ్చిన మంగారావుకు లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అనాకోడేరు వెళ్లి ఫింఛన్ అదజేత

నరసాపురం రూరల్: మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన కుక్కల నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ భీమవరం మండలం అనాకోడేరు గ్రామంలో కుమారుని ఇంటివద్ద ఉంటున్నాడు. దీంతో గత ఐదు నెలలుగా పింఛన్ తీసుకునేందుకు రాకపోవడంతో వలంటీర్ చారాబత్తుల రోదే వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. తాజాగా గురువారం అనాకోడేరు వెళ్లి నాగేశ్వరరావుకి ఆగష్టునెల ఫింఛన్ సొమ్మును అందజేసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అవినీతికి తావు లేకుండా సుపరిపాలన



17వ వార్డులో నిర్మించిన సీసీ రహదారి, డ్రెయిన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసాదరాజు

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల అమలు విషయంలో ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం ఉదయం నరసాపురం పట్టణంలోని 17వ వార్డులో అధికారులు ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు కుళాయిల ద్వారా వచ్చే తాగునీరు కలుషితమై వస్తుందని ఇబ్బందులు పడుతున్నామని ప్రసాదరాజు దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ కుళాయిల ద్వారా వచ్చే తాగునీరు కలుషితం కావడానికి కారణం తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వార్డులో లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉందని, దాని వల్ల రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే ఎలక్ట్రికల్ ఏఈ జె.ప్రభాకరరావును పిలిచి సాయంత్రం సమయంలో వచ్చి ఎందువల్ల లోఓల్టేజి సమస్య వస్తుందో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా 17వ వార్డులోని చర్చి రోడ్డు నుంచి బాలచంద్ర మహేశ్వరస్వామి గుడివరకూ రూ.10 లక్షలతో నిర్మించిన సిమ్మెంటు రోడ్డు, డ్రెయిన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గంలో 72 వేల కుటుంబాలు ఉంటే 70వేల కుటుంబాలకు పైబడి వివిధ రకాల కుల ధ్రువీకరణ పత్రాలను అందించామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా రెండో స్థానంలో నిలువగా ప్రభుత్వం అందిస్తున్న పలు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవడంలో నరసాపురం నియోజకవర్గం రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచిందని ప్రసాదరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డీఈ ఆర్.రమేష్‌బాబు, ఏఈలు సునీల్‌కుమార్, ప్రభాకర్‌రావు, పార్టీ నాయకులు షేక్ బులిమస్తాన్, భూసారపు జయప్రకాష్, కావలి నాని, గోరు సత్తిబాబు, ఏడిదకోట సత్యనారాయణ (వైకేఎస్), అడిదెల శరత్, కేసరి గంగరాజు, కామన బాల సత్యనారాయణ, మావూరి సత్యనారాయణ, మార్కండేయులు, సిర్రా కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందాలమ్మకు వెండి పూల బుట్ట సమర్పణ

పోడూరు: పెనుగొండ మండలం వడలి గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన శ్రీ మందాలమ్మ ఆయలం అభివృద్ధిలో భాగంగా తణుకు సత్య హాస్పటల్ అధినేత డాక్టర్ వెలిచేటి సుందరరావు, డాక్టర్ సరోజిని దంపతులు గురువారం అమ్మవారికి దాదాపుగా రూ.లక్ష విలువైన వెండి పూల బుట్టను, రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈ సందర్భంగా సుందరరావు, సరోజిని దంపతులు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

‘జగనన్న సురక్ష’ వినూత్న కార్యక్రమం



సిద్ధాంతంలో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పోడూరు: ‘జగనన్న సురక్ష’ వినూత్నమైన కార్యక్రమమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరు సమావేశంలో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జనన, మరణ, కులం, ఆదాయ ధ్రువపత్రాలను ప్రజలకు త్వరితగతిన ఉచితంగా అందించామన్నారు. గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలకు 10 రోజుల ముందుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సేవల కోసం సర్వే చేశారన్నారు. గ్రామ సభల ద్వారా ఆచంట నియోజకవర్గవ్యాప్తంగా 64 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు 51,567 ధ్రువపత్రాలు అందించామన్నారు. అవినీతికి తావులేకుండా అత్యంత పారదర్శకంగా అవసరమైన వారందరికీ సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. గతంలో టీడీపీ హయంలో జన్మభూమి సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం తప్ప ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు ఇవ్వలేదన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ‘జగనన్న సురక్ష’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి కొత్త ఒరవడి సృష్టించారన్నారు. ఇటీవల వచ్చిన వరద ముంపుతో లంక గ్రామాలు నీట మునిగినా రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగమంతా యుద్ధ ప్రాతిపదికన స్పందించి బాధిత ప్రజలకు అండగా నిలిచామన్నారు.

ఆచంట నుంచే పోటీ

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఆచంట నియోజకవర్గం నుంచే పోటీ చేయనున్నానని ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఆయన మాట్లాడారు. ఓటమి భయంతోనే ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు ఇప్పటి నుంచే తాను ఇక్కడ పోటీచేయడం లేదంటూ పుకార్లు సృష్టిస్తున్నారనీ..అలాంటి పుకార్లను నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు నమ్మొద్దని చెప్పారు. 2019 ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా విజయం సాధించినప్పట్నుంచీ తాను నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలతో మమేకమవుతున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఆచంట నుంచే పోటీచేసి ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు సేవలందించడమే తన ధ్యేయమన్నారు.

డ్రెయిన్ పరిశీలన

పోడూరు: పెనుగొండ మండలం సిద్ధాంతంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం సిద్ధాంతంలోని డ్రెయిన్‌ను పరిశీలించారు. గ్రామంలో పంచాయతీ వెనుక నుంచి గరగలమ్మ గుడి వరకూ ఉన్న కచ్చాడ్రెయినేజీ పూడిపోవడంతో వర్షాకాలంలో నీరు రోడ్లపైకి చేరి రోడ్లు కూడా బురదమయంగా మారుతున్నాయనీ, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ చింతపల్లి గనిరాజు సమస్యను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు వివరించారు. డ్రెయిన్ ను పరిశీలించిన ఎమ్మెల్యే జేసీబీతో డ్రెయిన్‌లో పూడిక తొలగించి ప్రక్షాళన చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు వెంట ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, ఏఎంసీ డైరెక్టర్ సత్తిబాబు, గ్రామకమిటీ అధ్యక్షుడు జుత్తుగ దామోదరరావు తదితరులున్నారు.

మూగజీవాల వల్ల ట్రాఫిక్ సమస్యలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో మూగజీవాల సంచారం ఎక్కువగా ఉందని వాటి వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుందని మునిసిపల్ కమిషనర్ బీఆర్‌ఎస్ శేషాద్రి అన్నారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో వివిధ ఆధ్యాత్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్లపై ఎక్కువగా సంచరిస్తున్నాయని, రాత్రి సమయంలో రోడ్డుపై గోవులు పడుకోవడం వల్ల చీకట్లో వాహనాలు వాటిని ఢీకొడుతున్నాయని తద్వారా అవి ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఆ గాయాలతో గోవులు చాలా ఇబ్బందులకు గురవుతున్నాయని తెలిపారు. గోవుల యజమానులు అందరూ తమ గోవులను ఇళ్ల వద్దే పెంచుకోవాలని కాదని నిర్లక్ష్యం చేస్తే భారీగా జరిమానా వేస్తామని హెచ్చరించారు. గోవులు తిరగకుండా ఒక ప్రదేశంలో వాటిని బంధించి రోడ్లపై తిరగకుండా కట్టడి చేస్తామన్నారు. ఒకవేళ గోవుల యజమానులు వచ్చి ఆ గోవు మాదే అని అంటే వారికి మునిసిపాలిటి అపరాధ రుసుములు వేసి వారి గోవులను అందజేస్తామన్నారు. ఇలా రెండో సారి కూడా రోడ్లపై కనిపిస్తే ఆ గోవుల యజమానులపై కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, ధర్మపరిరక్షణ సమితి సభ్యులు కేవీ కృష్ణ వర్మ, కొల్లి నరసింహమూర్తి, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, తులా రామలింగేశ్వరరావు, శీరం ఆందకృష్ణ, బైల శ్రీదర్, సేవ్ యానిమల్స్ సభ్యుడు మనీష్ గౌడ్, టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నవరత్న పథకాలు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



పాలకొల్లులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: నవరత్నాల పథకాలు పొందడానికి అర్హత ఉండి ధ్రువీకరణ పత్రాలు లేక నష్ట పోతున్నారని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రహించి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ వెల్లడించారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 15వేల శిబిరాలు ఏర్పాటు చేసి 1.46లక్షల కుటుంబాలకు 94 లక్షల ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు శ్రీనివాస్ చెప్పారు. పాలకొల్లు నియోజకవర్గంలో పాలకొల్లు పట్టణం, యలమంచిలి, పోడూరు, పాలకొల్లు మండలాల్లో 75,141 ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు వివరించారు. జగనన్న సురక్షా పథకంలో అందజేసిన ధ్రువీకరణ పత్రాలు ఏడాది పాటు చెల్లుబాటు అవుతాయన్నారు. ఈ పథకాల ద్వారానే నవరత్నాల పథకాలు పొందడానికి సులభతరం అవుతుందని శ్రీనివాస్ వివరించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానినికి క్షీరాభిషేకం చేస్తున్న నేతన్నలు

నరసాపురం రూరల్: ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న నేత సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిజంగా నేతన్నల పాలిటి నేస్తమనే అని వైఎస్సార్ సీపీ నరసాపురం పట్టణ జాయింట్ సెక్రటరీ యర్రా శ్రీనివాసు అన్నారు. నరసాపురం పట్టణంలోని వీవర్స్ కాలనీలో గురువారం నేతన్నలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 5 విడతలుగా వైఎస్సార్ నేతన్న నేస్తం సొమ్ములు అందుకున్నామన్నారు. నేతన్నలు పడుతున్న అగచాట్లు గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతీఏటా మగ్గం ఉన్న ప్రతీ చేనేత కుటుంబానికి ప్రోత్సాహకంగా ఏడాదికి రూ.24 వేలు చొప్పున వేస్తున్నందుకు ఈ ప్రభుత్వానికి చేనేత కుటుంబాలు కృతజ్ఞులమై ఉంటామని ముక్త కంఠంతో అన్నారు. నియోజకవర్గంలో మగ్గం కలిగిఉన్న 55 కుటుంబాల వారికి నేతన్ననేస్తం తమ బ్యాంకు ఖాతాల్లో జమైందన్నారు. తొలుత వారంతా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యర్రా ఉమ, బి శంకర సుబ్బారావు, బి రామలింగేశ్వరరావు, ఎం వనమరాజు, టి రాజయ్య, ఉయ్యూరు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులందరికీ సంపూర్ణ సహాయం

యలమంచిలి: దొడ్డిపట్ల ఏటిగట్టు దిగువున ఉన్న 212 మత్స్యకార, ఇతర బీసీ వర్గాల కుటుంబాలకు వరద సహాయం సంపూర్ణంగా అందిందని వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏటిగట్టు దిగువున ఉన్న వారందరికీ ఒక్కో కుటుంబానికి 25 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు, కిలో వంకాయలు, పావు కిలో పచ్చిమిర్చి అందజేశారన్నారు. పంచాయతీ సిబ్బంది వచ్చి పారిశుద్ధ్య పనులు చేశారన్నారు. వరద సహాయం అందరికీ సంపూర్ణంగా అందిందని తెలిపారు.